# ఈనాడు

## చిత్తూరు

సోమవారం 21 ఆగస్టు 2017 | 20 పేజీలు





కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్

# నిధులతోనే గ్రామీణ భారతం అభివృద్ధి

❖ ముగిసిన అగ్రశ్రీ జాతీయ సదస్సు

❖ పలువురికి రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాలు ప్రదానం

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** పంచాయతీరాజ్ నిధులతోనే గ్రామీణ భారతం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో '25 సంవత్సరాల అనంతరం పంచాయతీరాజ్ సంస్థల సంస్కరణలు' అనే అంశంపై స్థానిక హోటల్ బ్లిస్‌లో నిర్వహించిన జాతీయ సదస్సు రాజీవ్‌గాంధీ జాతీయ పురస్కారాల ప్రదాన కార్యక్రమంతో ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో నిధులు, విధులు, అధికారులను ప్రభుత్వాలు సమక్రమంగా అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఐటీఐ రంగంలో పునాదులు వేసింది రాజీవ్‌గాంధీ అని, దేశాభివృద్ధికి ఆయన హయాంలో అందుబాటులోకి తీసుకొచ్చిన నిర్ణయాలే నేడు అమలవుతున్నాయని గుర్తుచేశారు. మరో అతిథిగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశం పురోగతి సాధించాలంటే పంచాయతీరాజ్ ప్రతినిధులకు సమగ్ర నాయకత్వ శిక్షణ శిబిరాలు నిర్వహించాలన్నారు. అప్పుడే ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాజీవ్‌గాంధీ అత్యుత్తమ నాయకత్వ పురస్కారాన్ని ఐపీఎస్ఎస్ఆర్ మాజీ అధ్యక్షుడు ఆచార్య వి.ఆర్.పంచముఖి, రాజీవ్‌గాంధీ మహిళాశక్తి జాతీయ పురస్కారాన్ని ప్రముఖ మిసైల్ శాస్త్ర వేత్త డాక్టర్ టెస్సీథామస్‌కు మాజీ స్పీకర్ చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మాజీ రామచంద్రారెడ్డి, సెస్ ఆచార్యులు డాక్టర్ ఎం.గోపినాథ్‌రెడ్డి, అగ్రశ్రీ వ్యవస్థాపకుడు డాక్టర్ సుందరరామ్, భారతీ సుందరరామ్, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.